# పాపం - పుణ్యం

పెద్దకొడుకు కొండవీడు రాజ్యాన్ని పరిపాలి స్తుండగా చిన్న కొడుకు సన్యాసిలా ఊళ్ళు పట్టు కుని తిరగడం తల్లికి బాధ కలిగించింది. ఆమె చిన్న కొడుకే మహాకవి వేమన. ప్రపంచంలోనే మొదటిసారిగా ప్రజాకవిత్వం చెప్పిన ప్రజాకవి వేమన.

వేమన దేవుడిని సైతం విమర్శిస్తూ భక్తి లేకుండా వుండడం చూసి ఆ తల్లి మనసు క్షోభించి పోయింది. తను దేశ, దేశాలు తిరిగి పవిత్ర పుణ్యక్షేత్రాలను దర్శించాలని నిశ్చయించు కుంది. అందుకు తగిన ఏర్పాట్లు చేశాడు మహా రాజు. ఆమె తనతో పాటు చిన్నకొడుకు వేమనను గూడా పుణ్యక్షేత్రాలకు తీసుకెళ్ళాలనుకుంది.

"నాయనా! నాతోపాటు వచ్చి పుణ్య క్షేత్రాలు దర్శించుకుని పవిత్ర నదులలో మునిగి తరించు. చేసిన పాపాలన్నీ పోతాయి." అని కొడుక్కి నచ్చ చెప్పింది.

"అమ్మా! ఎన్నో పాపాలు చేసి పుణ్య క్షేత్రాలు దర్శించి, పవిత్ర నదులలో మునిగితే సరి పోతుందా?" అని ప్రశించాడు.

"అవును నాయనా! పెద్దలు అలాగే చెప్పారు గదా!" అంది తల్లి.

వేమన ఒక రాగినాణెం గుడ్డలో మూట కట్టి ఆమె చేతికి ఇచ్చి "అమ్మా! దీన్ని నీతో త్రిప్పి, నదుల్లో ముంచి తీసుకురా!" అన్నాడు.

వేమన తల్లి అలాగే అన్ని పుణ్యక్షేత్రాలనూ దర్శించుకుని, తనతో పాటు ఆ గుడ్డ మూటనూ



నదులలో ముంచి తీసుకొచ్చింది.

వేమన తల్లి సమక్షంలోనే గుడ్డ మూట విప్పాడు. రాగి నాణెం అలాగే ఉంది.

"అమ్మా! చూశావా? ఎన్ని పుణ్యక్షేత్రాలు తిరిగినా ఎన్ని నదుల్లో మునిగినా రాగినాణెం బంగారు నాణెంగా మార లేదు. అలాగే మనిషి చేసిన పాపాలు ఎక్కడికీ పోవు. చేసిన పాపం పోయి పుణ్యాం వస్తుందని అనుకోవడం మన భ్రమ." అన్నాడు.

వేమన చెప్పిన మాటలు విని అతని తల్లి సిగ్గు పడింది.

'ఎలుక తోలు ఎన్నాళ్ళు ఉతికినా నలుపు నలుపే గాని తెలుపు కాదు' అని వేమన చెప్పిన పద్యం, పాపాలు చేసి పుణ్యాం చేస్తే పోతుందని భ్రమపడే వారి గురించే అయి వుంటుంది.